క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన

కరప: గ్రామంలో నాయకులు, అధికారులతో కలిసి గురువారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలిస్తారని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. తర్వాత స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీఓ కె.అప్పారావు చెప్పారు. ఈ సందర్భంగా వలంటీర్లకు అవార్డులు అందజేస్తారన్నారు.

ఘనంగా సీతారామస్వామి కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతా రామస్వామి ఆలయంలో బుధవారం సీతా రామ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గ్రామ దేవతల తీర్థం

కరప: సిరిపురం గ్రామ దేవతలైన గోగులమ్మ, మహాలక్ష్మమ్మ తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ఏటా ఫిబ్రవరి 21న అమ్మవార్ల తీర్థం జరుపుతారు. ముందురోజైన మంగళవారం రాత్రి గరగనృత్యాలు, గారడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతలను దర్శించుకున్న మహిళలకు ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు తమ సొంత ఖర్చుతో ఐదు వేల మందికి చీరలు పంపిణీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు, సిరిపురం పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

కల్యాణ మంటపాన్ని సకాలంలో పూర్తి చేయాలి

కరప: గ్రామంలో నిర్మిస్తున్న మండల అంబేడ్కర్ కల్యాణ మంటపం నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం కల్యాణ మంటపం నిర్మాణ పనులను వారు పరిశీలించారు. మండల ఎస్సీ నాయకుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి, కరపలో స్థలం కేటాయించి, రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మార్నెళ్ల వెంకటరమణ, అడబాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణపై అవగాహన

కాకినాడ క్రైం: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల రక్షణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిశ వన్ స్టాప్ సెంటర్ బృందం బుధవారం స్థానిక దుమ్ములపేటలో విముక్తి ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించింది. అక్కడి బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో కేసులు, మహిళల హక్కులు, సంరక్షణ చట్టాలు, మైనర్ల సంరక్షణ కోసం ప్రభుత్వ, చట్టబద్ధమైన చర్యలపై అవగాహన కల్పించారు. దిశ ఎస్సై నాగకల్యాణి, దిశ వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ జెమీమా, ఏఎస్సై చంద్ర, పాఠశాల బోధకులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరేందుకు భాషా ప్రావీణ్యం దోహదం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): భాషా ప్రావీణ్యంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రముఖ వైద్యుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణ అన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, హిందీ శాఖ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో అమ్మ భాషలకు అందలమని, సాంకేతిక వికాసంతో భాష, సాహిత్యాలు ప్రజలందరికీ చేరుతున్నాయన్నారు. భాష నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్ ద్వారా వృత్తి, ఉద్యోగ రంగాల్లో రాణించవచ్చన్నారు. నన్నయ వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ టి.సత్యనారాయణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మాతృభాషతో పాటు ఆంగ్లం నేర్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, పూర్వ విద్యార్థుల సంఘ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, ర్యాలీ ప్రసాద్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కాకినాడ రూరల్: తూరంగికి చెందిన వివాహిత మల్లాడి సూర్యావతి (25) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. తూరంగి శివాలయం వీధి ఎదురుగా ఉంటున్న సూర్యావతికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. భర్త ప్రసాద్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆమె వైద్యం పొందుతోంది. తన కుమార్తె ఆత్మహత్యకు భర్త ప్రసాద్, అత్త రాఘవ కారణమని మృతురాలి తల్లి కాలాడి వీరవేణి ఫిర్యాదు చేసింది. కేసును ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి వివరాలు లభ్యం

కాకినాడ రూరల్: తిమ్మాపురం వద్ద లభ్యమైన మృతదేహం వివరాలు లభ్యమయ్యాయి. మృతుడు గొల్లప్రోలుకు చెందిన గురుపిల్లి నాగేశ్వరరావు(43)గా గుర్తించారు. అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బయటకు వచ్చిన నాగేశ్వరరావు తిమ్మాపురం ఎస్సీ పేట సమీపంలో ఖాళీ స్థలంలో మృతి చెందాడు.

కల సాకారం

- కరపలో మహాత్మా జ్యోతిరావు పూలే శెట్టిబలిజ కల్యాణ మంటపం
- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో పూర్తయిన నిర్మాణం
- ఫలించిన రెండు దశాబ్దాల నిరీక్షణ

కరప: కరపలో కల్యాణ మంటపం నిర్మించుకోవాలని శెట్టిబలిజ సామాజిక వర్గీయులు ఎంతోకాలంగా కోరుకుంటున్నారు. పాలకులు మారినా కల్యాణ మంటపం మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. అదే సామాజిక వర్గం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు గెలుపొందినా.. కల్యాణ మండపం ఆ సామాజిక వర్గానికి అందని ద్రాక్షగానే మిగిలింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో నిధులు మంజూరు చేసి, కరపలో మహాత్మా జ్యోతిరావు పూలే శెట్టిబలిజ కల్యాణ మండపం నిర్మించారు. రెండు వారాల క్రితం దీనిని ప్రారంభోత్సవం చేయడంతో తమ కలసాకారమైందని శెట్టిబలిజ వర్గీయులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ నేపథ్యమిదీ..

కరప మండలం.. తాళ్లరేవు నియోజకవర్గంలో ఉన్నప్పుడు 2004లో ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు గెలుపొందాక, కరపలో తగిన స్థలం కేటాయించి, కల్యాణ మంటపం నిర్మించాలని శెట్టిబలిజ సామాజిక వర్గీయులు కోరారు. అది కార్యరూపం దాల్చకుండానే ఆయన పదవీకాలం ముగిసింది. తర్వాత నియోజకవర్గాల పునర్విభజనతో కరప మండలం కొత్తగా ఏర్పడిన కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కలిసింది. 2014లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా పిల్లి అనంతలక్ష్మి గెలుపొందగా, శెట్టిబలిజ సామాజిక వర్గంవారు తమ కల్యాణ మంటపం అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారు. ఆమె పదవీ కాలం చివరలో 2013లో అప్పటి సర్పంచ్ పోలిశెట్టి తాతీలు సీతమ్మవీధిలోని పంచాయతీ స్థలాన్ని శెట్టిబలిజ కల్యాణ మంటపానికి కేటాయిస్తూ, తీర్మానం చేయించారు. ఆ మేరకు ఎమ్మెల్యే అనంతలక్ష్మి భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. పునాది వేసినా నిధులు మంజూరు కాకపోవడంతో, మళ్లీ కల్యాణ మంటపం పనులు నిలిచిపోయాయి. 2019లో ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబు గెలుపొంది, మంత్రి పదవి దక్కడంతో వైఎస్సార్ సీపీలోని శెట్టిబలిజ సామాజిక వర్గీయులు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు తదితరులు సీతమ్మవీధిలో కల్యాణ మంటపం విషయాన్ని ఎమ్మెల్యే కన్నబాబు వద్ద ప్రస్తావించారు. వెంటనే ఆయన స్పందించి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పర్యవేక్షణలో కల్యాణ మంటపం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ఈ కల్యాణ మంటపానికి మహాత్మా జ్యోతిరావు పూలే శెట్టిబలిజ కల్యాణ మంటపంగా నామకరణం చేశారు. ఈ నెల ఐదో తేదీన ఎమ్మెల్యే కన్నబాబు దీనిని ప్రారంభించడంతో, తమ కల సాకారమైందని శెట్టిబలిజ వర్గీయులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబు బీసీల అభ్యున్నతికి చేస్తున్న కృషికి గుర్తింపుగా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉంటామని చెబుతున్నారు.


కరపలో నిర్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే శెట్టిబలిజ కల్యాణ మంటపం

వారి మేలు మరువలేనిది



శెట్టిబలిజ సామాజిక వర్గంతో పాటు, ఇతర బీసీలకు రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సముచిత స్థానం కల్పించి, ఆయా వర్గాల అభ్యున్నతికి చేస్తున్న మేలు మరువలేనిది. మండల చరిత్రలో ఎవరూ చేయలేనిది, శెట్టిబలిజ సామాజక వర్గానికి ఎంపీపీ పదవిచ్చిన ఘనత కన్నబాబుకే దక్కుతుంది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి బీసీలందరూ మద్దతుగా నిలబడి పార్టీ విజయానికి కృషి చేస్తాం.

– పెంకే సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు, కరప

బీసీలకు ప్రాధాన్యం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు అధిక శాతం పదవులిచ్చి, రాజ్యాధికారం కట్టబెడుతున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ఎమ్మెల్యే ఇలా చేయలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కన్నబాబుకు శెట్టిబలిజ సామాజికవర్గం రుణపడి ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కన్నబాబును గెలిపించి, తద్వారా జగనన్నను మళ్లీ సీఎంను చేస్తాం.

– కాదా వెంకటేశ్వరరావు, విజయరాయుడుపాలెం

అందుబాటులోకి రానున్న బ్లడ్ బ్యాంక్


గవర్నర్ దత్త సుబ్బారావును సత్కరిస్తున్న రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో నిర్మిస్తున్న సేవా ప్రాజెక్టులు త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని క్లబ్ 3020 గవర్నర్ దత్తా సుబ్బారావు అన్నారు. అధికార పర్యటనలో భాగంగా బుధవారం ఆయన రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్‌ను సందర్శించారు. సుమారు 50 మంది వృద్ధులకు పింఛనును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడు తూ క్లబ్ కాకినాడ సెంట్రల్ భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసేందుకు స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు శుభపరిణామమన్నారు. దీనితో పాటు దాతల సహకారంతో నిర్మించిన బ్లడ్ బ్యాంక్, ఫిజియోథెరపీ సెంటర్ త్వరలో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. అసిస్టెంట్ గవర్నర్ తడాల వరప్రసాద్ సెంట్రల్ క్లబ్ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ గవర్నర్ అధికార పర్యటన సందర్భంగా రోటరీ ఇంటర్నేషనల్‌కు 1,500 డాలర్లు విరాళం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు కల్యాణ్ చక్రవర్తి, ఎస్‌వీఎస్ రావు, బాబీ పాల్గొన్నారు.

సీఎం ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వాకలపూడిలో గౌడ సామాజిక భవనం ప్రారంభోత్సవం

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. వాలకలపూడి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గౌడ సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను పర్యటించినప్పుడు, గౌడ సామాజిక వర్గ భవనం కోరడంతో, ఆ మేరకు పనులు ప్రారంభించి తక్కువ కాలంలో పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కాకినాడ రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితరులకు సముచిత స్థానం కల్పించామన్నారు. బీసీల్లో అన్ని వర్గాల వారికి పదవులు ఇచ్చామన్నారు. ఐదేళ్ల పాలనలో గతంలో ఎప్పుడూ జరగనంత అభివృద్ధి చేశామన్నారు. సుమారు 125 ఆలయాలు నిర్మించామన్నారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి 8 కల్యాణ మండపాలు కట్టామన్నారు. జిల్లా యాదవ సంఘానికి జిల్లా స్థాయి కల్యాణ మండపం నిర్మిస్తున్నామని చెప్పారు. ఆర్యవైశ్యులకూ కల్యాణ మండపం నిర్మించామన్నారు. వాకలపూడిలో చెరువును సుందరంగా తీర్చిదిద్ది, వాకింగ్‌కు అనుకూలంగా అభివృద్ధి చేశామన్నారు. గత నాలుగన్నరేళ్లుగా అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ ద్వారా నేరుగా రూ.1,600 కోట్ల సంక్షేమ పథకాల నగదు ఇచ్చామన్నారు. రూ.110 కోట్ల నిధులతో తాగునీటి సదుపాయం కల్పించామని, 32 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చామని వివరించారు. అమ్మఒడి, ఆసరా, నేతన్న నేస్తం, కాపు నేస్తం, వాహన మిత్ర ఇలా.. 72 పథకాలతో పేదల పక్షాన సీఎం జగన్ నిలిచారన్నారు. రూ.2.55 లక్షల కోట్లు నేరుగా పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించిన సీఎం చరిత్రలోనే లేరన్నారు. గౌడ కల్యాణ మండప నిర్మాణంలో కృషి చేసిన కోమలి సత్యనారాయణ, గణేష్, రాజు, తదితరులను అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, వైస్ ఎంపీపీ బందిలి వీరేష, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, నాయకులు గొల్లపల్లి జగన్, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.


వాకలపూడిలో గౌడ సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

యాదవ కులస్తులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే ద్వారంపూడి
- యాదవుల కమ్యూనిటీ హాలు ప్రారంభం

కాకినాడ: అన్ని విధాలా యాదవ కులస్తులకు అండగా ఉంటామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక జగన్నాథపురం 22వ డివిజన్ కోరట్ల వారివీధిలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాలును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సువిశాల ప్రాంగణంలో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లతో అధునాతన సౌకర్యాలు, విశాల ప్రాంగణంలో కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. ఇప్పటికే గొల్లపేట, సూర్యనారాయణపురంలో రెండు కమ్యూనిటీ హాళ్లతో పాటు, దీనిని అదనంగా నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిషోర్, బొర్రా రమణ, మీసాల దుర్గాప్రసాద్, జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, నాయకులు నొడగల బాబురావు, నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


యాదవ కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

నాగేశ్వరరావుకు సత్కారం

జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మన్నే నాగేశ్వరరావును ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి సత్కరించారు. యాదవ కులాల సంక్షేమానికి, బీసీల అభ్యున్నతికి నాగేశ్వరరావు మరింత కష్టపడి పనిచేయాలని ఆకాంక్షించారు.

ఆత్మ బంధువులు వలంటీర్లు

సత్కరించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమ పథకాలను ప్రతి పేదింటికి అందిస్తూ, వలంటీర్లు ప్రజలకు ఆత్మబంధువులుగా మారారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ప్రభుత్వం నుంచి సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందుకున్న వలంటీర్లను ఆయన సత్కరించారు. రమణయ్యపేటలోని స్పందన ఫంక్షన్‌హాలులో బుధవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ విజయవంతమైందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 2.8 లక్షల వలంటీర్లను ఏర్పాటు చేస్తామంటే సాధ్యమవుతుందా అని అందరూ భావించారని, దీనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యం చేసి చూపారన్నారు. రాష్ట్రంలో 96 లక్షల కుటుంబాలకు వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. 69 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీ నుంచే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను చూసి ప్రతిపక్షాలు రోదిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సుమారు రెండు వేల మంది వలంటీర్లుండగా, వీరిలో 80 శాతం మంది మహిళలే ఉన్నారన్నారు. వలంటీర్లను కించపరిచేలా ప్రతిపక్ష నాయకులు మాట్లాడడం విచారకరమన్నారు. వలంటీర్లకు సీఎం జగన్ అండగా ఉన్నారన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రూ.మూడు వేల కోట్ల సంక్షేమ పథకాల సొమ్మును లబ్ధిదారులకు అందించామని, సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. నియోజకవర్గంలో వలంటీర్లకు ఏటా రూ.12 కోట్ల గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నారాయణ మూర్తి, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, జేఎన్‌టీయూకే వీసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు రామదేవు చిన్న, ఆనందరావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్, వైఎస్సార్ సీపీ రమణయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్లను సత్కరిస్తున్న కురసాల కన్నబాబు

ఎమ్మెల్యేకు ల్యాబ్ టెక్నీషియన్ల వినతి

కాకినాడ రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ తరఫున టెక్నీషియన్లు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు బుధవారం వినతిపత్రం అందించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కన్నబాబును సంఘ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రసాద్, వరసాల సిద్ధు, అమ్మిరాజు, శ్రీనివాసరావు, శేఖర్ తదితరులు కలిశారు. లేబరేటరీలు నిర్వహించే యువతకు రాయితీతో కూడిన బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. బేసిక్ లేబరేటరీలో టెస్టుల అనంతరం టెక్నీషియన్‌కు సంతకం చేసే అర్హత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ: నేషనల్ హైవే రోడ్లను విస్తరించడానికి, ఏపీ ట్రాన్స్‌కో టవర్లు మార్పు చేసేందుకు స్థానిక ప్రతాప్‌నగర్, గొల్లపాలెం 132 కేవీ సబ్‌స్టేషన్లకు 220 కేవీ కాకినాడ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జొన్నాదుల రామారావు, ప్రసాద్, రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్‌లో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కాకినాడ, ప్రతాప్‌నగర్, పోర్టు ఏరియా, నడకుదురు, గొల్లపాలెం, మామిడాడ, తాళ్లరేవు, రామచంద్రపురం ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.వార్షిక మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట, తుఫాన్ బిల్డింగ్, పోర్టు కాలనీ, గోపాలకృష్ణ నగర్ ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

కాకినాడ రూరల్: వార్షిక విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుండి రెండు వరకు తిమ్మాపురం సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ వాకలపూడి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్ తెలిపారు. ఏడీబీ రోడ్డు, అచ్చంపేట జంక్షన్, కొత్తూరు జంక్షన్, గోసాల ఏరియా, రాయుడుపాలెం, శేషాద్రి నగర్, కిరణ్ కంటి హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

ఎన్నికల సమరానికి ‘సిద్ధం’కండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు

కాకినాడ: త్వరలో జరగనున్న ఎన్నికలకు పార్టీ కేడర్ సమాయత్తం కావాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డి.కన్వెన్షన్‌లో వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్టీ విస్తృత సమావేశం జరిగింది. బూత్ కన్వీనర్లు, ఇతర ముఖ్య నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రతి ఒక్క పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ప్రధానంగా బూత్ కమిటీ ప్రతినిధులు ప్రజలతో నిత్యం మమేకమవ్వాలని సూచించారు. చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించడం ద్వారా ప్రజలకు మరింత దగ్గర కావాలని కోరారు. టీడీపీ–జనసేన వంటి ప్రతిపక్షాలు రాజకీయంగా కుమ్మక్కై, తప్పుడు వాగ్దానాలతో ప్రజల్లోకి వస్తున్నాయని, ఈ రెండు పార్టీలతో మన కేడర్ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న 50 రోజులు పార్టీకి అత్యంత కీలకమని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గెలుపు సునాయాసం అయినప్పటికీ, తేలిగ్గా తీసుకోవద్దని, కష్టపడి పనిచేయాలని సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం, వై ఏపీ నీడ్స్ జగన్ వంటి కార్యక్రమాలతో ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లామని, మంచి స్పందన కనిపించిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లోకి మరోసారి వెళ్లి ప్రజలకు ఇచ్చిన 30 వేల ఇళ్ల పట్టాలు, 29 వేల వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు, 24 వేల మందికి చేయూత పథకం లబ్ధి, 34 వేల మందికి ఇచ్చిన అమ్మ ఒడి వంటి అన్ని పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఓ వైపు ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొడుతూనే, మరోవైపు చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజెప్పడం ద్వారా ప్రజలకు మరింత దగ్గర కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పలువురు మాజీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు


వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలిగా సుంకర శివప్రసన్నతో పాటు, నూతన కార్యవర్గాన్ని పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో ఆమెతో పాటు, ఇతర కార్యవర్గాన్ని అభినందిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఇతర నాయకులు

మత్స్యకారుల్లో చిచ్చు పెట్టొద్దు

హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి



కాకినాడ: రాజకీయ స్వార్థం కోసం మత్స్యకారుల మధ్య చిచ్చు పెట్టవద్దని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు హితవు పలికారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అబద్ధపు ప్రచారాలతో నిందలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును ఉద్దేశించి సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మత్స్యకారులు కష్టాల్లో ఉన్నప్పుడు అడ్రస్ లేని వనమాడి, ఎన్నికలు సమీపించగానే ఓట్ల కోసం మత్స్యకారులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో వేటకు వెళ్లక, అనారోగ్యాల పాలైన మత్స్యకారులకు వైద్య సేవలు అందించేందుకు కొండబాబు ఏ మాత్రం స్పందించలేదన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ద్వారంపూడి ఎంతో మందికి సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే మత్స్యకార ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించడంతో పాటు, మత్స్యకార వర్గానికి రాజకీయంగా సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. ఈ వాస్తవాలను జీర్ణించుకోలేక తాను చేయని అభివృద్ధి ద్వారంపూడి చేశారన్న అక్కసుతోనే వనమాడి కొండబాబు, ఇతర మత్స్యకార నాయకులు ఎమ్మెల్యే మత్స్యకార జాతిని కించపరిచారంటూ వాస్తవాలను విస్మరించి, విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకార వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏ ఒక్క నాయకుడు చేయని విధంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పని చేసి చూపించారని, ఈ వాస్తవాలను గుర్తించి, తప్పుడు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

అందరికీ ఆదర్శం మల్లాడి సత్యలింగ నాయకర్

నివాళులర్పించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ సిటీ: విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ అందరికీ ఆదర్శప్రాయులని, దాత ఆశయ సాధనకు కృషి చేయాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్ వ్యవస్థాపకులు, మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎంఎస్ఎన్ చారిటీస్ అభివృద్ధికి కృతనిశ్చయంతో ఉన్నానన్నారు. చారిటీస్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో, ఈ సంస్థ దేవాదాయ, ధర్మదాయ శాఖలో ఉన్నప్పటికీ తాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.50 లక్షలతో సంస్థ ప్రాంగణంలో రహదారులు వేయించామన్నారు. విద్యార్థుల క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దాలని, గ్రావెల్‌తో చదును చేసే ప్రయత్నాలను చేపడితే టీడీపీ నాయకుడు వనమాడి వెంకటేశ్వరరావు, అతని అనుసరులు అవాంతరాలు సృష్టించడంతో పనులు ఆగిపోయాయన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఎంఎస్ఎన్ చారిటీస్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సంస్థ సహాయ కమిషనర్, ఈఓ ఆర్‌వీ చందన మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడా, విద్యాంశాలల్లో పాల్గొన్న విద్యార్థులను, అవార్డులు పొందిన ఉపాధ్యాయులను, పదవీవిరమణ చేసిన ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో కౌడ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి, దుర్గాప్రసాద్, ఎంజీకే కిషోర్‌కుమార్, సంగాని నందం, బుర్రా రమణ, చవ్వాకుల రాంబాబు, ఆంధ్రా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జగన్నాథరావు, నన్నయ యూనివర్సిటీ పీజీ సెంటర్ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, పూర్వపు ధర్మకర్తల మండలి సభ్యులు పొన్నమండ విజయకుమార్, ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.


నాయకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

సత్యలింగ నాయకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కాకినాడ రూరల్: విద్యాదాత, ఆదికవి నన్నయ యూనివర్సిటీ(ఎంఎస్ఎన్)లో క్యాంపస్ స్థల దాత, కాకినాడ ప్రజానీకానికి విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడిన మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ వర్ధంతి నిర్వహించారు. క్యాంపస్‌లో నాయకర్ విగ్రహానికి ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు తదితరులు ఘన నివాళులర్పించారు ముఖ్యఅతిథి క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ ఎన్ఎస్ఎస్ అధికారి హరిబాబు, అధ్యాపకులు అజయ్ రతన్, జోసఫ్ స్టీఫెన్, హారిక, మహమ్మద్ నదీమ్ పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో పతక విజేతలకు అభినందన

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పుణెలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారుల అభినందన కార్యక్రమం బుధవారం కాకినాడలో జరిగింది. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈఓ చుండ్రు గోవిందరాజు, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి గౌరవఅతిథిగా పాల్గొన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి బాపిరాజు విజేతల వివరాలు తెలిపారు. మహబూబ్ షకీలా హైజంప్‌లో బంగారు, పోల్‌వాల్ట్‌లో రజత పతకం సాధించింది. పి.కోయిరాజు జావెలిన్ త్రోలో బంగారు, సి.రజియా హేమర్ త్రోలో బంగారు, ఎస్‌డీవీఎల్ దేవి హర్డిల్స్ రజత పతకం కైవసం చేసుకున్నారు. వీరికి నగదు పురస్కారాలు అందించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కృష్ణారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రముఖులు